వెల్దండ మండలం కొట్రలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

తిమ్మాజిపేట : మారేపల్లి కాలనీలో ఎగిరపోయిన ఇంటి పై రేకులు

బిజినేపల్లి ప్రధాన రహదారిపై అడ్డంగా పడిన చెట్లు

అచ్చంపేట : బొమ్మన్‌పల్లిలో ఇంటిపై విరిగిపడిన చెట్టు

అచ్చంపేట : బాల్యతండాలో విరిగి పడిన చెట్లు


కల్వకుర్తి : ఇందిరానగర్ కాలనీలో విరిగిపడిన చెట్టు

గాలివాన... బీభత్సం

- రోడ్డుపై విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- పిడుగుపడి వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి : పాలెం వద్ద విరిగిన చెట్టు

బిజినేపల్లి, మే 26 : జిల్లా వ్యాప్తంగా గాలివాన ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. బలంగా గాలలు వీయడంతో పలుచోట్ల పెద్ద, పెద్ద చెట్లు నేలకొరగగా, విద్యుత్ స్తంభాలు కూలిపడిపోయాయి. బిజినేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో పెద్ద చెట్లు నేలకొరిగాయి. నల్లవాగు నుంచి చేగుంట గేట్ వరకు ప్రధాన రహదారిపై చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. రేకుల షెడ్లు, ఇండ్లు కూలిపడ్డాయి. మంగనూర్ నుంచి బిజినేపల్లికి వస్తున్న కారు వర్షానికి రోడ్డు కనిపించకపోవడంతో రోడ్డు పక్కకు దూసుకుపోయింది. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి.

చారకొండ : అపస్మారక స్థితిలో పడిన జైపాల్‌నాయక్

అమ్రాబాద్ మండలంలో..

అమ్రాబాద్, మే 26 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో కాలువల్లో వర్షం నీరు చేరి రోడ్లపైకి ప్రవహించాయి. వానలు కురుస్తుండడంతో రైతులు తమ పొలాలను దున్ని సిద్ధం చేసుకుంటున్నారు.

చారకొండలో..

చారకొండ, మే 26 : మండలంలోని చారకొండ, తుర్కపల్లి, తిమ్మాయిపల్లి, కమాల్‌పూర్ తదితర గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కమాల్‌పూర్ పంచాయతీ పరిధిలో నూకలచింతవాడిక తండాకు చెందిన ఇస్లావత్ జైపాల్ నాయక్ పొలంలో పశువులకు నీళ్లు తాపించేందుకు వెళ్లాడు. పిడుగు పడటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు 108 ద్వారా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బిజినేపల్లిలో గాలివానకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్, మే 26 : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌స్తంభాలు, రోడ్ల పొడవునా చెట్లు నెలకొరిగాయి. దాదాపు 40కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. బిజినేపల్లి మండలంలో 20 స్తంభాలు, తాడూరు మండలంలో 8 స్తంభాలు, నాగర్‌కర్నూల్ మండలంలో 8 స్తంభాలు విరిగిపడినట్లు సమాచారం.

అచ్చంపేటలో..

అచ్చంపేట, మే 26 : అచ్చంపేట మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం గాలితో కూడిన వర్షం రావడంతో రేకుల ఇళ్లు కూలిపోయి, చెట్లు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అచ్చంపేట మండలంలోని సింగారం ప్రాంతంలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని బాల్యతండాలో గాలివానకు కాట్రావత్ సోమ్లానాయక్ ఇంటిప కప్పు రేకులు ఎగిరిపోయాయి. బొమ్మన్‌పల్లిలో చెట్టు విరిగి లింగయ్య ఇంటిపై పడి ఇల్లు ధ్వంసమైంది. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించేందుకు పనులు చేపట్టారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

బిజినేపల్లి, మే 26 : రైతులు సాగు సమయంలో సరైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏవో నీతి అన్నారు. ఆదివారం మండలంలోని వట్టెం, వెల్గొండ గ్రామాల్లో రైతులకు ఎరువులు, విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విడిగా అమ్ముతున్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని, డీలర్ల వద్దనే కొనుగోలు చేసి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పంటకాలం ముగిసే వరకు కూడా విత్తన ప్యాకెట్లకు సంబంధించిన బిల్లులను భద్రపర్చుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ కమిటీ

నాగర్‌కర్నూల్, మే 26 : నాగర్‌కర్నూల్ పట్టణంలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులు ముందుకొచ్చారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని పలుప్రాంతాలు, చౌరస్తాల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం సేఫ్టీగా పెయింటింగ్ వేసి అందరి మన్ననలు పొందారు.

పెయింటింగ్ వేసిన వారిలో రోడ్డు సేఫ్టీ జిల్లా కమిటి ప్రెసిడెంట్ వెంకటేశ్, కార్యదర్శి నర్సింహారెడ్డి, ఆర్గనైజర్లు శ్రీను, పాండు, ఖాజా, షాకీర్, రాజు, రాంచందర్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

శ్రీశైలం మే 26 – శ్రీశైల క్షేత్ర పరిధి ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. నాగర్‌కర్నూల్‌కు చెందిన రాఘవేందర్ ఆదివారం మల్లన్న దర్శనానికి వస్తుండగా సాక్షి గణపతి ఆలయం సమీపంలో స్పీడ్ బ్రేకర్ దాటుతుండగా నెల్లూరుకు చెందిన చందు కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో అదుపు తప్పిన బాధితుల వాహనం అడవిలోకి చిక్కుకుపోయింది. ప్రమాదంలో నాగర్‌కర్నూలుకు చెందిన కుటుంబానికి స్వల్ప గాయాలు కాగా మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు. అతి వేగంతో నిర్లక్ష్యంగా నడుపుతూ వాహనాన్ని అదుపు చెయ్యలేక ప్రమాదానికి కారణమైన వాహనదారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సిలిండర్ లీకేజీతో వ్యక్తికి గాయాలు

కల్వకుర్తి రూరల్, మే 26 : పట్టణంలోని బాలాజీ స్వీట్స్ దుకాణంలో ఆదివారం సిలిండర్ పైపు లీకేజీ కావడంతో వ్యక్తికి గాయాలైన ఘటన చోటుచేసుకున్నది. దుకాణంలో స్వీట్లను తయారు చేస్తుండగా రెగ్యులేటర్ వద్ద లీకై పొగలు వ్యాపించడంతో వెంటనే నిర్వాహకులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.

దీంతో ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకొని లీకేజీని నియంత్రించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, మే 26 : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. ఆదివారం కానిస్టేబుల్ మల్లయ్య, లింగం కంసానిపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలో కంసానిపల్లికి చెందిన కొట్టే శేఖర్ అనుమతి లేకుండా దుందుభి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

చారకొండ, మే 26 : పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు శ్రీనివాసులు, సత్యం అన్నారు. తమ తండ్రి జ్ఞాపకార్థం శ్రీశైలం మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 14ఏండ్లుగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

యుద్ధాలు ఎప్పటికీ అనర్థాలే..

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పుస్తక రచయిత నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, మే 26 : యుద్ధాలు ఎప్పటికీ అనర్థాలేనని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం కందనూలు కళా సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గుడిపల్లి నర్సింహారెడ్డి రచించిన 'సంక్షిప్త మహాభారతం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కాలంలో అయినా, ఏ ప్రాంతంలో అయినా యుద్ధాలు ధన, ప్రాణ, ఆస్తి, ప్రకృతికి నష్టాలను కల్పించే అనర్థాలేనని చెప్పారు. గుడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, రైతు బిడ్డ నర్సింహారెడ్డి 18 పర్వాల ఇతిహాసాల్లో నన్నయ్య, తిక్కన, ఎర్రన తెలుగులో రాసిన మహాభారతాన్ని సులభశైలిలో అందరికీ అర్థమయ్యేలా రచించడం అభినందనీయమన్నారు. పుస్తకాలను చదవడమే గగనంగా ఉన్న ఈ కాలంలో మహాభారతాన్ని అధ్యయనం చేసి అందులోని సారాంశాన్ని గ్రహించి నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాలకు అన్వయించి సులభతరంగా పుస్తకాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి కవి వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించగా, మరో ముఖ్యఅతిథిగా కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పుస్తక సమీక్షకురాలు మందా సురేఖారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు దినకర్, ముద్రణా దాతలు నారాయణరెడ్డి, బాలయ్య, జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్ష్య, కార్యదర్శులు పెబ్బేటి నిరంజన్, కల్వకోలు మద్దిలేటి, బ్రహ్మచారి, సీనియర్ కళాకారులు డి.రాములు, రఘుపతి, సురేశ్‌బాబు, సత్యం, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, మే 26 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు ప్రవీణ్, శ్రీనివాసులు, రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని స్పష్టం చేశారు.

ఇష్టంతో చదివితే మెరుగైన ఫలితాలు

కొల్లాపూర్ రూరల్, మే 26 : విద్యార్థులు ఇష్టంతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంటుందని రత్నగిరి ఫౌండేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్మోహన్‌రావు విద్యార్థులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు అర్థమెటిక్, రీజనింగ్ ట్రైనర్ వెంకటేశ్‌తో గణితంపై రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన అవగాహన కల్పించారు. 250 మంది విద్యార్థులు గణితంలో మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు సురేశ్, సాయి చరణ్, శివకుమార్, సందీప్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

హత్య కేసును నీరుగార్చేందుకు ప్రభుత్వం కుట్ర

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొల్లాపూర్ రూరల్, మే 26 : చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడంలేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామచంద్రయాదవ్ ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్య కేసులో కాంగ్రెస్ నేతల ప్రమేయం ఉన్నందునే పోలీసులు నిందితులను అరెస్టు చేయడంలేదని ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో వరుస హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తూ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మంత్రి జూపల్లి 20 ఏండ్ల పాలనలో కొల్లాపూర్‌ను అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురిచేశారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ పాండునాయక్, కౌన్సిలర్ కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ జంబులయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, పెంట్లవెల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సాయిరాంయాదవ్, మధు, హరికృష్ణ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకా.. డ్రైనేజా?


అగ్రహారంతండాలో భగీరథ ట్యాంక్‌లో మురికిగా మారిన నీళ్లు

చారకొండ, మే 26 : మండలంలోని అగ్రహారంతండా పాఠశాలలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ అపరిశుభ్రంగా మారి నీళ్లు మురుగుగా మారాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఇలాంటి నీటిని సరఫరా చేస్తే ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశముందని వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ సర్కారులో ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలం అందించగా, కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యంగా వహిస్తూ కనీసం తాగునీరు కూడా సరిగా సరఫరా చేయడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భగీరథ ట్యాంక్‌ను శుభ్రం చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వంగూరు : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వంగూరు, మే 26 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నకేశవులు, శంకర్‌నాయక్‌లను ఘనంగా సన్మానించారు. అలాగే తమకు సేవలందించిన అటెండర్లు రాజాబాబు, బాల్‌రాం, లింగమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేశ్, భానుచందర్, శ్రీను, సురేశ్, రాకేశ్, మల్లేశ్, నిర్మల, స్వప్న, ఖైరావతి, రాజేశ్వరి, రషీదా, మాధవి, సంధ్య, అరుణ, సైదులు, జహంగీర్, శివ, మాధవ్‌తోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్ : పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్చాలలో..

కల్వకుర్తి రూరల్, మే 26 : కల్వకుర్తి మండలం మార్చాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09 పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ మాత విగ్రహానికి గురువులతో కలిసి విద్యార్థులు పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పీఈటీ యశోద, విద్యార్థులు శ్రీశైలం, తిరుపతయ్య, శివరాం మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, రాములునాయక్, సుగుణ, నారాయణగౌడ్, రేణుక, మురళీధర్ రెడ్డి, సురేందర్‌గౌడ్, రవీంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, మే 26 : మండలంలోని మంగనూర్‌లో 2003-04 సంవత్సరం విద్యార్థుల ఆదివారం జిల్లా పరిషత్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. 20ఏండ్ల తర్వాత కలుసుకొని ఒకరి గురించి ఒకరు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
★Mahaboobnagar, Kamala Nehru Cly. Bayamma Thota, Indp. House 372 Yds. House No. 1-4-130/4/A9, E/F, 2000 Sft. Ph: 9949918256, 9440295825.
NT-327835

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794